# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు

9th - HAPPY - ANNIVERSARY

9 సంవత్సరాల ప్రయాణం

సంపుటి : 10 సంచిక : 299 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం గురువారం 11 జూలై 2024 వెల : 5/-రూ॥

VOLUME :10 ISSUE : 299 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM THU 11 JULY 2024 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Kakinada, Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Prakasam,Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur


# ఆర్థిక శాఖ శ్వేతపత్రంపై సీఎం చంద్రబాబు కసరత్తులు

### ఇప్పటికే పోలవరం, అమరావతి, విద్యుత్ అంశాలపై శ్వేతపత్రాల విడుదల

### ఆర్థికశాఖపై దృష్టి సారించిన సీఎం చంద్రబాబు

### రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై అధికారులతో సమీక్ష



పెన్ పవర్ డెస్క్:ఇప్పటికే పోలవరం, అమరావతి, విద్యుత్ రంగంపై శ్వేతపత్రాలు విడుదల చేసిన ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తాజాగా ఆర్థిక శాఖపై దృష్టి సారించారు. త్వరలోనే ఆయన ఆర్థిక శాఖపై శ్వేతపత్రం విడుదల చేయనున్నారు. ప్రస్తుతం చంద్రబాబు ఈ దిశగా కసరత్తులు చేస్తున్నారు. రాష్ట్ర ఆర్థిక స్థితిపై అధికారులతో సమీక్ష జరిపారు. రాష్ట్రానికి ఉన్న అప్పుల లెక్కలపై ఆరా తీశారు. ఇప్పటికే అన్ని రకాల అప్పులు కలిపి రూ.14 లక్షల కోట్లు అని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఇదే విషయాన్ని వారు సీఎం చంద్రబాబుకు తెలియజేశారు.

పెండింగ్ బిల్లులు ఎన్ని ఉన్నాయనే అంశంపై కూడా చంద్రబాబు దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో, ఆర్థిక మంత్రిత్వ శాఖ వివిధ శాఖల వారీగా పెండింగ్ బిల్లుల వివరాలు కోరింది.

## పిన్నెల్లి బెయిల్ పిటిషన్లపై తీర్పు ఈ నెల 18కి వాయిదా



**టీడీపీ ఏజెంట్ పై దాడి, సీఐపై దాడి కేసుల్లో పిన్నెల్లి అరెస్ట్**

**నెల్లూరు జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న పిన్నెల్లి**

**పిన్నెల్లికి బెయిల్ నిరాకరించిన మాచర్ల కోర్టు**

**గుంటూరు 4వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టును ఆశ్రయించిన పిన్నెల్లి**

పెన్ పవర్ డెస్క్:మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని ఇటీవల పోలీసులు అరెస్ట్ చేయడం తెలిసిందే. ఎన్నికల సమయంలో

వివరాలు 2లో..

## ఆర్థిక సర్వేపై స్పందించే దమ్ము జగన్ కు ఉందా?



**ఏపీలో గత ఐదేళ్లు విధ్వంసకర పాలన సాగిందన్న యనమల**

**ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిందని వెల్లడి**

**ఏమీ చేయకుండానే అన్నీ చేసినట్టు గొప్పలు చెప్పుకున్నారని విమర్శలు**

**అందుకే ప్రజలు వైసీపీని ఓడించి బుద్ధి చెప్పారని వ్యాఖ్యలు**

వివరాలు 2లో..




# సంపాదకీయం

## కర్రపెండలం పంట.. సాగు పద్ధతులు ఇవే

సాగవుతున్న దుంపజాతి కూరగాయ పంటల్లో కర్రపెండలానికి విశిష్ఠ స్థానం వుంది. వర్షాధారంగా జూన్, జూలై మాసాల్లోను, నీటి పారుదల కింద సంవత్సరం పొడవునా సాగుచేయవచ్చు. దుంపజాతి పంటైన కర్రపెండలాన్ని ముఖ్యంగా సగ్గుబియ్యం, గంజి పొడి తయారీలో ఎక్కువగా ఉపయోగిస్తారు. ఇది మంచి రుచికరమైన ఆహారం కూడా.దీని దుంపలను ఉడకబెట్టి తింటారు. కర్రపెండలం నుంచి వివిధ ఉత్పత్తులను తయారీచేసే పరిశ్రమలు ఈ ప్రాంతంలో వుండటంతో వేలాది మంది రైతులు ఈ పంటసాగుతో ఉపాధిపొందుతున్నారు. మెట్ట ప్రాంతాల్లో వర్షాధారంగా కర్రపెండలం సాగు గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

**పంట ఎప్పుడు నాటాలంటే..**

వాణిజ్యసరళిలో సాగుచేసే దుంపజాతి కూరగాయ పంటల్లో కర్రపెండలం ప్రధానమైంది. దేశవ్యాప్తంగా 15 లక్షల 70 వేల ఎకరాల్లో సాగులో వుంది. కర్రపెండలాన్ని కసావా లేదా టాపియోకా అంటారు. ఇది ఉష్ణమండలపు పంట. అధిక తేమ, ఉష్ణోగ్రత గల వాతావరణం సాగుకు అనుకూలంగా వుంటుంది. సరైన వర్షపాతం గల మెట్ట, కొండ ప్రాంతాల్లో వర్షాధారంగా , ఆరుతడి పంటగా సాగుచేయవచ్చు. నీటి ఎద్దడిని బాగా తట్టుకుంటుంది. ఏజన్సీ ప్రాంతాల్లో ఈ పంటను అధికంగా సాగు చేస్తారు. జూన్– .. జూలై మాసాల్లో ఈ దుంప పంట సాగు మొదలు పెడితే... డిసెంబరు నుంచి మార్చిలోపు దుంప తీతకు వస్తుంది. దీని పంట కాలం, రకాన్నిబట్టి 8–నుంచి10నెలలు వుంటుంది. కర్రపెండలం దుంపల్లో పీచు పధార్ధంతో పాటు, పిండి పధార్ధం ఎక్కువగా వుంటుంది.

**కర్ర పెండలం.. సాగు రకాలు**

వరి పండని ప్రాంతాల్లో, దక్షిణాఫ్రికా వంటి దేశాల్లోని ప్రజలకు కర్రపెండలం ప్రధాన ఆహారం. దీని దుంపలనుంచి తయారుచేసే పౌడర్ ను వస్త్ర పరిశ్రమలో షైనింగ్ కోసం వాడతారు. అలాగే సగ్గుబియ్యం, జిగురు తయారీ, పశువుల దాణా తయారీ పరిశ్రమల్లోను, ఇథనాల్ తయారీకి ఎక్కువగా ఉపయోగిస్తారు. దుంపలు తియ్యగా వుంటాయి కనుక చిప్స్ తయారీలోను, వివిధ వంటకాల్లోను వాడుతున్నారు. మెట్టప్రాంతం , నీటి వసతి తక్కువగా వుండటంతో రైతులు వర్షాధారంగా కర్రపెండలం సాగుకు మొగ్గుచూపుతున్నారు. తేలికపాటి ఇసుక భూములు, ఇసుకతో కూడిన ఒండ్రు నేలలు, ఎర్ర గరప నేలల్లో కర్రపెండలం దుంప వృద్ధి అధికంగా వుంటుంది. మన ప్రాంతంలో సాగుకు అనుగుణంగా హెచ్–226, హెచ్–165, శ్రీ ప్రభ, శ్రీ జయ, శ్రీ ప్రకాస్ వంటి రకాలు రైతులకు అందుబాటులో వున్నాయి.

**ఎలా నాటాలంటే...**

గత పంటనుంచే విత్తనాన్ని సేకరించి రెండునెలలపాటు విత్తనం భద్రపరుస్తారు. విత్తనాన్ని కొమ్మలతో ప్రవర్ధనం చేస్తారు.7నుంచి –10నెలల వయసున్న బలమైన కొమ్మలను విత్తనపు కర్రలగా ఉపయోగించాలి. విత్తనపు కొమ్మల కొనభాగాన్ని మొదలు భాగాన్ని తొలగించి 20సెం.మీ పొడవుగల ముక్కలుగా కత్తిరిస్తారు. ఈ విత్తనపు ముచ్చెలనుంచి వేర్లు వృద్ధిచెందేందుకు 7 నుంచి 10 రోజులపాటు నారుమడిలో పెంచాల్సి వుంటుంది. ఎకరాకు 5 వేల విత్తనపు ముచ్చెలు అవసరమవుతాయి. వీటిని పెంచేందుకు 1మీటరు వెడల్పు, రెండున్నర మీటర్ల వెడల్పు, 15 సెంటీమీటర్ల ఎత్తు కలిగిన రెండు నారుమడులు అవసరం.

**నారుమడి జాగ్రత్తలు**

నారుమడిలో నాటేముందు మాంకోజెబ్ 3గ్రాములు, డైమిథోయేట్ 2మిల్లీలీటర్లు లీటరు నీటికి కలిపిన ద్రావణంలో ముచ్చెలను ముంచి నారుమడిలో పక్కపక్కనే నాటుకోవాలి. 7నుంచి 10రోజుల్లో ముచ్చెలు వేర్లు తొడిగి, చిగురించటం ప్రారంభమవుతుంది. వీటిని ప్రధాన పొలంలో నాటుకోవాలి. నాటే ముందు ఆఖరి దుక్కిలో ఎకరాకు 5టన్నుల పశువుల ఎరువు, 150కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, చెదల నివారణకు 20కిలోల లిండేన్ లేదా మిథైల్ పెరాథియాన్ పొడి వేసి కలియ దున్నాలి. నేలను 30నుంచి –35సెంటీమీటర్ల లోతుగా 3నుంచి 4సార్లు దుక్కిచేయాలి. వర్షాల వల్ల భూమిలో తగినంత తేమచేరిన తర్వాత ఆరోగ్యవంతమైన వేరు, చిగురు తొడిగిన ముచ్చెలను నాటటానికి ఉపయోగించాలి. వరుసలు, మొక్కల మధ్య ఎటుచూసినా 90సెంటీమీటర్ల ఎడం వుండేటట్లుగా, 5సెంటీమీటర్ల లోతులో ముచ్చెలు నాటుకోవాలి. నాటిన వారం పది రోజుల్లో ముచ్చెలనుంచి కొమ్మలు విస్తరించటం ప్రారంభమవుతుంది. నాటిన 10నుంచి 15రోజుల్లో చనిపోయిన మొక్కల స్థానంలో, 40సెంటీమీటర్ల పొడవున్న వేరు తొడిగిన ముచ్చెలను నాటాల్సి వుంటుంది.

**ఎరువుల వివరాలు**

కర్రపెండలం నాటిన 15 నుంచి 90రోజుల వరకు కలుపు లేకుండా నివారించాలి. ఈ పంటకు నత్రజని, పొటాష్ ఎరువులను పైపాటుగా అందించాలి. ఎకరాకు 24కి. నత్రజని, 24కి. పొటాష్ సరిపోతుంది. దీన్ని 3సమభాగాలుగా చేసి నాటిన 30, 60, 90 రోజులకు వేయాలి. ప్రతి మొక్క చుట్టూ గొప్పుచేసి మొక్కల మొదళ్లకు మట్టిని ఎగదోయాలి. 3నెలల వరకు తోటలో రసంపీల్చు పురుగులు, మచ్చ తెగుళ్ల బెడద లేకుండా జాగ్రత్త వహించాల్సి వుంటుంది.

**సాగులో ప్రధాన సమస్య**

ఈ పంటలో ప్రధానమైన సమస్య కసావా మొజాయిక్ వైరస్. దీనికి నివారణ లేదు కాబట్టి తెగులు సోకని తోటల నుండి నాణ్యమైన విత్తనాన్ని ఎంపికచేసుకోవాలి. వైరస్ ను వ్యాప్తిచేసే తెల్లదోమను సకాలంలో అరికట్టాలి. దోమ కనిపించిన వెంటనే డైమిథోయేట్ 2 మిల్లీలీటర్లు లేదా ఎసిఫేట్ 1గ్రాము లేదా ప్రొఫినోఫాస్ 2 మిల్లీలీటర్లు లీటరు నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారిచేయాలి. మొజాయిక్ వైరస్ ను సమర్థంగా తట్టుకునే శ్రీ రక్ష –1, శ్రీ రక్ష –2 రకాలను సాగుకు ఎంపిక చేసుకోవాలి.

**ఎప్పుడు నాటాలి... ఎప్పుడు కోయాలి**

కర్ర పెండల దుంప పెరగడం వర్షం మీద ఆధారపడి వుంటుంది. వర్షాభావ పరిస్థితులు ఏర్పడినప్పుడు ఆక్టోబరు నుండి డిసెంబరు వరకు 3 నీటితడులు ఇవ్వగలితే దుంప బాగా వూరి దిగుబడి గణనీయంగా పెరుగుతుంది. ఈ పంటను జూన్... –జూలైలో నాటితే ఫిబ్రవరి.. మార్చిలో దిగుబడి వస్తుంది. ఈ సమయంలో దుంప తవ్వి సగ్గుబియ్యం ఫ్యాక్టరీలకు తరలిస్తారు. రైతులు కర్రపెండల దుంప ఊరుదలనుబట్టి ఎకరాకు 40 నుంచి 50 పుట్ల దిగుబడి సాధిస్తున్నారు. ఒక్కో పుట్టిని 225 కిలోలుగా లెక్కిస్తారు.

## ఆర్థిక సర్వేపై స్పందించే దమ్ము జగన్ కు ఉందా?

టీడీపీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడు మాజీ సీఎం జగన్ పై ధ్వజమెత్తారు. ఆర్థిక సర్వేపై స్పందించే దమ్ము జగన్ కు ఉందా? అని నిలదీశారు. ఏపీ ఆర్థిక వ్యవస్థ ఏ విధంగా కుప్పకూలిందో ఆర్థిక సర్వే 2022–23 ద్వారా స్పష్టంగా అర్ధమవుతుందని అన్నారు.

అమరావతి, పోలవరం, నదుల అనుసంధానం, పారిశ్రామిక రంగం, విద్యుత్... ఇలా అన్ని వ్యవస్థలను వైసీపీ ప్రభుత్వం నాశనం చేసిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో గత ఐదేళ్లు విధ్వంసకర పాలన కొనసాగిందని అన్నారు. ఏమీ చేయకుండానే అన్నీ చేసినట్టు గొప్పలు చెప్పుకున్నారని విమర్శించారు. అందుకే, ప్రజలు వైసీపీకి తగిన బుద్ధి చెప్పి, తలరాతను తిరగరాశారని యనమల వ్యాఖ్యానించారు.

వైసీపీ పాలనలో అన్ని రంగాలను నిర్లక్ష్యం చేసి గాలికి వదిలేశారని మండిపడ్డారు. ప్రభుత్వ ఆసుపత్రులను నరక కూపాలుగా తయారుచేశారని, ఆరోగ్య శ్రీని అనారోగ్య శ్రీగా మార్చివేశారని విమర్శించారు.ఏపీలో నెలకొన్న భయానక పరిస్థితులతో ఒక్క పారిశ్రామికవేత్త కూడా ఇటువైపు చూడని పరిస్థితి నెలకొందని, ఉన్న పరిశ్రమలు వెళ్లిపోయాయని అన్నారు. వ్యవసాయ రంగం పరిస్థితి మరీ దారుణమని, వందేళ్ల వ్యవసాయ రంగ చరిత్రలో పాతాళానికి పడిపోయిన దుస్థితిని వైసీపీ ప్రభుత్వంలోనే చూశామని యనమల విమర్శించారు. జగన్ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులు కూడా పూర్తి చేయలేకపోయిందని, అప్పుల బాధతో రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని వివరించారు.

జగన్ తప్పుడు విధానాలతో ఆక్వారంగం బలైందని యనమల పేర్కొన్నారు. ఆక్వా విద్యుత్ రేట్ల పెంపునకు తోడు అవినీతి కూడా ప్రభావం చూపిందని తెలిపారు.

## పిన్నెల్లి బెయిల్ పిటిషన్లపై తీర్పు ఈ నెల 18కి వాయిదా

- మొదటి పేజీ తరువాయి


పాల్వాయిగేట్ పోలింగ్ కేంద్రంలో టీడీపీ ఏజెంట్ నంబూరి శేషగిరిరావుపై దాడి, సీఐ నారాయణస్వామిపై దాడి కేసుల్లో పోలీసులు పిన్నెల్లిని అదుపులోకి తీసుకున్నారు. పిన్నెల్లి ప్రస్తుతం నెల్లూరు జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఈ రెండు కేసుల్లో బెయిల్ కోసం పిన్నెల్లి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. మాచర్ల కోర్టు తన బెయిల్ పిటిషన్ తిరస్కరించడంతో ఆయన గుంటూరు నాలుగో అదనపు జిల్లా సెషన్స్ కోర్టును ఆశ్రయించారు. పిన్నెల్లి పిటిషన్లపై నేడు గుంటూరు కోర్టు విచారణ చేపట్టింది. ఈ రెండు కేసుల్లో పోలీసు విచారణ జరుగుతున్నందున... తీర్పును ఈ నెల 18కి వాయిదా వేస్తున్నట్టు న్యాయస్థానం తెలిపింది. పిన్నెల్లి బెయిల్ పిటిషన్లపై విచారణ సందర్భంగా నేడు గుంటూరు కోర్టులో వాదనలు జరిగాయి. రాష్ట్ర ప్రభుత్వం తరఫున పీపీ అశ్విని కుమార్ వాదనలు వినిపించారు. పిన్నెల్లికి నేర చరిత్ర ఉందని, ఈ కేసులో ఇంకా కొందరిని అరెస్ట్ చేయాల్సి ఉందని అశ్విని కుమార్ తెలిపారు. పిన్నెల్లి పోలీస్ కస్టడీ వివరాలను కూడా న్యాయస్థానానికి అందించారు. పిన్నెల్లి పోలీసు విచారణకు సహకరించడంలేదని వివరించారు. ఈ నేపథ్యంలో, పిన్నెల్లికి బెయిల్ ఇవ్వొద్దని కోరారు.

## బీపీసీఎల్ ప్రతినిధులతో భేటీపై సీఎం చంద్రబాబు ట్వీట్

### సీఎండీ కృష్ణకుమార్ నేతృత్వంలో రాష్ట్రానికి వచ్చిన బీపీసీఎల్ బృందం

### అమరావతిలో సీఎం చంద్రబాబుతో భేటీ

### చమురు పరిశ్రమ కోసం అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్న చంద్రబాబు



భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) ప్రతినిధులతో సమావేశం అనంతరం ఏపీ సీఎం చంద్రబాబు సోషల్ మీడియాలో స్పందించారు. దేశంలోని తూర్పు తీరంలో వ్యూహాత్మక స్థానంలో ఉన్న మన రాష్ట్రం గణనీయమైన పెట్రో కెమికల్ సామర్థ్యాలను కలిగి ఉందని తెలిపారు. ఇవాళ బీపీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణకుమార్ నాయకత్వంలోని ప్రతినిధుల బృందంతో సమావేశమయ్యానని పేర్కొన్నారు. రాష్ట్రంలో రూ.60 వేల కోట్ల నుంచి రూ.70 వేల కోట్లతో చమురు శుద్ధి కర్మాగారం, పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయడంపై చర్చించామని చంద్రబాబు తెలిపారు. దీనిపై 90 రోజుల్లో వివరణాత్మక నివేదికను, సాధ్యాసాధ్యాలపై నివేదికను అందించాలని కోరానని వెల్లడించారు. ఈ ప్రాజెక్టు కోసం దాదాపు 5 వేల ఎకరాల భూమి అవసరమవుతుందని, ఎలాంటి ఇబ్బందులు లేని రీతిలో ప్రభుత్వం పరిశ్రమ స్థాపనకు అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు సిద్ధంగా ఉందని చంద్రబాబు తన ట్వీట్ లో స్పష్టం చేశారు.

## గత ప్రభుత్వంలో ఈ శాఖ ఉందని కూడా ఎవరికీ తెలియదు: మంత్రి అచ్చెన్నాయుడు

### మత్స్యశాఖపై అచ్చెన్నాయుడు సమీక్ష

### మత్స్యశాఖ పరిస్థితి చూస్తుంటే చాలా బాధ కలుగుతోందన్న అచ్చెన్నాయుడు

### అధికారులకు కీలక ఆదేశాలు ఇచ్చినట్టు వెల్లడి



ఏపీ మంత్రి అచ్చెన్నాయుడు నేడు మత్స్యశాఖపై సమీక్ష సందర్భంగా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో మత్స్యశాఖ పరిస్థితి చూస్తుంటే చాలా బాధ కలుగుతోందని అన్నారు. గత ప్రభుత్వంలో మత్స్యశాఖ ఉందన్న విషయం కూడా ఎవరికీ తెలియదని వ్యాఖ్యానించారు. వైసీపీ సర్కారు హయాంలో ఐదు హార్బర్లకు టెండర్లు పిలిచి సొంతవారికే కట్టబెట్టారని, రెండోసారి నాలుగు హార్బర్లను వైసీపీ ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు ఇచ్చారని అచ్చెన్నాయుడు ఆరోపించారు. మత్స్యకారులకు డీజిల్ రాయితీ రూ.10 కోట్ల బకాయి ఉందని వెల్లడించారు. డీజిల్ సబ్సిడీ బకాయిలు చెల్లించాలని ఆదేశాలు ఇచ్చామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. మత్స్యకార భృతిపై సర్వే చేసి 20 రోజుల్లో నివేదిక ఇవ్వాలని అధికారులకు నిర్దేశించినట్టు వివరించారు. మత్స్య పరిశ్రమ ఎగుమతుల వృద్ధికి ప్రణాళికలు రూపొందించుకోవాలని, ఎగుమతులకు ఉన్న అన్ని అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని అధికారులకు సూచించినట్టు అచ్చెన్నాయుడు వెల్లడించారు.

## ఫైళ్ల దహనం వ్యవహారం.... విజయవాడలోని పీసీబీ ప్రధాన కార్యాలయంలో పోలీసుల విచారణ



ఇటీవల కృష్ణా నది కరకట్టపై ప్రభుత్వ ఫైళ్ల దహనం వ్యవహారం తీవ్ర కలకలం రేపింది. ఆ ఫైళ్లపై మాజీ మంత్రి పెద్దిరెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు(పీసీబీ) మాజీ చైర్మన్ సమీర్ శర్మ ఫొటోలు ఉన్నట్టు గుర్తించారు. దీనిపై నిగ్గు తేల్చేందుకు పోలీసులు విచారణను వేగవంతం చేశారు. ఇవాళ విజయవాడలోని పీసీబీ ప్రధాన కార్యాలయంలో పోలీసులు విచారణ జరిపారు. పీసీబీలోని ఏడు విభాగాల అధికారులను పోలీసులు ప్రశ్నించారు. కార్యాలయం నుంచి ఫైళ్లు బయటికి వెళ్లడంపై ప్రశ్నించారు. ఫైళ్లు, హార్డ్ డిస్కులు బయటికి వెళ్లడంలో అధికారుల పాత్రపై విచారణ చేపట్టారు. దహనం చేసిన ఫైళ్లలోని అంశాలు, వాటి ప్రాధాన్యతపై ఆరా తీశారు. ఫైళ్లలోని సమాచారంపై పీసీబీ సిబ్బంది వాంగ్మూలాలు రికార్డు చేశారు.

## మార్పు రావాలి... కాంగ్రెస్ రావాలి అంటే... మొత్తానికి పెద్ద మార్పే వచ్చింది: కేటీఆర్ ఆగ్రహం

### నాడు కాంగ్రెస్ పాలనలో హాస్టళ్లలో పురుగుల అన్నం.. నీళ్ల చారు..

### ఇప్పుడు బల్లిపడిన టిఫిన్లు, చిట్టెలుక పడిన చట్నీలని మండిపాటు

### విషాహారం తింటే... విద్యార్థుల ప్రాణాలకు గ్యారెంటీ ఎవరు? అని ప్రశ్న



మార్పు రావాలి... కాంగ్రెస్ రావాలంటూ పలికి మొత్తానికి కాంగ్రెస్ వాళ్లు వచ్చారని... అలాగే వారు చెప్పినట్లుగా పెద్ద మార్పే తెచ్చారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఈ మేరకు కేటీఆర్ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. 'జేఎన్టీయూ మెస్ చట్నీలో చిట్టెలుక' అనే వార్తా క్లిప్పింగ్‌ను ఆయన జోడిస్తూ... కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు.

ఆనాటి కాంగ్రెస్ పాలనలో.. ప్రభుత్వ హాస్టళ్లలో దుస్థితి.. పురుగుల అన్నం.. నీళ్ల చారు.. ఈనాటి కాంగ్రెస్ పాలనలో..

ప్రభుత్వ హాస్టళ్లలో ఇంకా అధ్వాన పరిస్థితి.. బల్లిపడిన టిఫిన్లు, చిట్టెలుకలు తిరిగే చట్నీలు అంటూ ఎద్దేవా చేశారు.

మొన్న భువనగిరి సాంఘిక సంక్షేమ పాఠశాలలో కలుషిత ఆహారం తిన్న విద్యార్థి జీవితం విషాదంతమైందని... నిన్న కోమటిపల్లి హాస్టల్లో ఉప్మాలో బల్లి పడి 20 మంది విద్యార్థులు వాంతులు చేసుకున్నారని గుర్తు చేశారు. సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ హాస్టల్‌లో చట్నీలో చిట్టెలుక దర్శనంతో ఇక్కడి విద్యార్థులు బెంబేలెత్తారన్నారు. ఈ విషాహారం తింటే.. విద్యార్థుల ప్రాణాలకు గ్యారెంటీ ఎవరు?? అల్లారుముద్దుగా పెంచుకున్న తల్లిదండ్రులకు భరోసా ఎక్కడ??? అని ప్రశ్నించారు. కలుషిత ఆహారం వల్ల... పిల్లలు ఆడుకోవాల్సిన వయస్సులో ఆసుపత్రుల పాలవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.అస్తవ్యస్తంగా మారిన ప్రభుత్వ వ్యవస్థ వల్లే విద్యార్థులకు ఈ అవస్థ వచ్చిపడిందని... దీంతో వారికి ఈ అస్వస్థత అని పేర్కొన్నారు. ఇకనైనా కాంగ్రెస్ సర్కారు కళ్లు తెరవాలని లేదంటే భావిభారత పౌరుల నిండు ప్రాణాలకే ప్రమాదమని హెచ్చరించారు. వైఫల్యాలను సరిచేయకపోతే ఊహించని విషాదం చోటు చేసుకునే అవకాశాలు ఉంటాయని హెచ్చరించారు.

## తెలంగాణలో ప్రభుత్వం ఎప్పుడు కూలుతుందా? అని బీజేపీ చూస్తోంది: బీవీ రాఘవులు

తెలంగాణలో ప్రభుత్వం ఎప్పుడు కూలుతుందా? ఎప్పుడు గద్దెనెక్కుదామా? అని బీజేపీ కాచుకొని కూర్చుందని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. బీజేపీ కుట్రలను తిప్పికొట్టేందుకు లౌకిక శక్తులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏకం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలపై కేంద్రం మోపిన భారాన్ని మరిచిపోయి... రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చదువుతున్నారని విమర్శించారు.

హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో రాఘవులు మాట్లాడుతూ... తెలంగాణలో బీఆర్ఎస్‌కు మనుగడ ఉండాలంటే బీజేపీకి వ్యతిరేకంగా రాజకీయ నిర్ణయం తీసుకోవాలని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు సూచించారు. పార్లమెంట్‌లో ఇష్యూ టు ఇష్యూను బట్టి వ్యవహరిస్తామని కేటీఆర్ చెప్పడాన్ని ఆయన తప్పుబట్టారు. అలా స్పందించడమంటే రాజకీయం కాదని... లొంగుబాటు అవుతుందన్నారు.

దేశమంతా అభివృద్ధి జరిగితే ఇటీవలి లోక్ సభ ఎన్నికల్లో బీజేపీకి సీట్లు ఎందుకు తగ్గాయో ప్రధాని మోదీ చెప్పాలని నిలదీశారు. సీట్లు ఎందుకు తగ్గాయో ఆలోచన, ఆత్మవిమర్శ లేకుండా మోదీ మాట్లాడుతున్నారని విమర్శించారు. బీజేపీ ఎన్నికలను డబ్బులతో ముంచేసిందని ఆరోపించారు.

**తెలంగాణలో బీజేపీ ఓటు బ్యాంకు పెరగడం ప్రమాదకరం**

తెలంగాణలో బీజేపీ ఓటు బ్యాంకు 19 శాతం నుంచి 35 శాతానికి పెరగడం ప్రమాదకరమని వ్యాఖ్యానించారు. ఇక్కడ బీజేపీని నియంత్రించడంలో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందన్నారు. కేరళలోనూ బీజేపీ ఒక సీటు సాధించడం చింతించాల్సిన విషయమే అన్నారు. ప్రధాని మోదీ కార్పొరేట్ శక్తులకు సేవకుడిగా వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు.

ఇండియా కూటమి విచ్ఛిన్నం కాకుండా ముందుకు వెళ్లడంలో సీపీఎం చేసిన త్యాగం మరే పార్టీ చేయలేదన్నారు. ఓట్లు.. సీట్లు కాదని... దేశాన్ని రక్షించుకోవడమే సీపీఎం లక్ష్యమన్నారు. తెలంగాణలో మతోన్మాదాన్ని ప్రజల మనస్సులో నుంచి తొలగించే బాధ్యత సీపీఎంపై ఉందన్నారు.

# భారత్-రష్యా సంబంధాలపై స్పందించిన అమెరికా

**భారత్-రష్యా మైత్రిపై ఆందోళన ఉన్నప్పటికీ తమది వ్యూహాత్మక భాగస్వామ్యమని వెల్లడి**

**రష్యాతో సంబంధాలపై తమకు పూర్తి స్పష్టత ఉందన్న అగ్రరాజ్యం**

**భారత ప్రధాని మోదీ రష్యాతో పాటు జెలెన్స్కీతోనూ మాట్లాడారన్న అమెరికా**



భారత్-రష్యా సంబంధాలపై అగ్రరాజ్యం అమెరికా స్పందించింది. రష్యాతో భారత్ సన్నిహిత సంబంధాలు కొనసాగించడంపై ఆందోళనలు ఉన్నప్పటికీ... భారత్‌తో తమ వ్యూహాత్మక భాగస్వామ్యం కొనసాగుతుందని అమెరికా స్పష్టం చేసింది. ఈ మేరకు అమెరికా విదేశాంగ శాఖ, రక్షణ శాఖలు భారత్-రష్యా అధినేతల సమావేశం, సన్నిహిత సంబంధాలపై స్పందించాయి. భారత్, రష్యా మధ్య ఎంతోకాలంగా ద్వైపాక్షిక సంబంధాలు ఉన్నాయని పెంటగాన్ ప్రెస్ సెక్రటరీ మేజర్ జనరల్ ప్యాట్ రైడర్ అన్నారు. తమ వరకు భారత్ తమకు వ్యూహాత్మక భాగస్వామి అన్నారు. రష్యాతో భారత్‌కు ఉన్న సంబంధాలపై తమకు పూర్తి స్పష్టత ఉందని పేర్కొన్నారు. ఈ వారం నాటో శిఖరాగ్ర సదస్సు సమయంలో... మోదీ మాస్కో పర్యటనపై ప్రపంచం దృష్టి సారించిందన్నారు.

ప్రపంచ దేశాలకు తాము దూరం కాలేదని వ్లాదిమిర్ పుతిన్ ప్రకటించుకున్నా ఆశ్చర్యం లేదన్నారు. ఉక్రెయిన్‌పై యుద్ధ నిర్ణయమే ప్రపంచానికి రష్యాను దూరం చేసిందన్నారు. దీనికి రష్యా ఎంతో మూల్యం చెల్లిస్తోందన్నారు. భారత ప్రధాని మోదీ కేవలం రష్యాతోనే కాకుండా జెలెన్స్కీతో కూడా మాట్లాడారని గుర్తు చేశారు. శాంతియుత పరిష్కారానికి భారత్ మద్దతు ఇస్తుందనే భరోసా కల్పించిందన్నారు. భారత్-రష్యా సంబంధాలపై ఆందోళనలు ఉన్నప్పటికీ... తమకు స్పష్టత ఉందని అమెరికా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మాథ్యూ మిల్లర్ అన్నారు. రష్యాతో మైత్రి కొనసాగింపుపై తమ ఆందోళనను భారత్‌కు ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నామన్నారు.

# రాజ్ తరుణ్‌పై మొదటిసారి ఫిర్యాదు చేసినప్పుడు లావణ్య ఆధారాలు ఇవ్వలేదు: డీసీపీ శ్రీనివాస్

**ఆధారాలు అందించాలని లావణ్యకు నోటీసులు ఇచ్చామన్న డీసీపీ**

**రెండోసారి ఆధారాలతో ఫిర్యాదు చేశారన్న డీసీపీ**

**దీంతో లావణ్య మరోసారి ఫిర్యాదు చేశారని వెల్లడి**



సినీ నటుడు రాజ్ తరుణ్‌పై లావణ్య మొదటిసారి ఫిర్యాదు చేసినప్పుడు ఆధారాలు ఇవ్వలేదని అందుకే ఆధారాలు కావాలని ఆమెకు నోటీసులు జారీ చేశామని రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ వెల్లడించారు. ఆమె రెండోసారి ఆధారాలతో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. దీంతో రాజ్ తరుణ్‌పై సెక్షన్ 493 కింద కేసు నమోదు చేశామన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... రాజ్ తరుణ్ తనను పెళ్లి చేసుకున్నాడని లావణ్య నిన్న మరో ఫిర్యాదు చేసిందన్నారు. అన్ని కోణాల్లో పరిశీలించి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. పదేళ్లుగా తనతో కాపురం చేసినట్లు ఆమె చెప్పిందన్నారు. రాజ్ తరుణ్‌పై నార్సింగ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

**అబార్షన్ చేయించాడు: లావణ్య**

రాజ్ తరుణ్‌తో తనకు పదేళ్ల క్రితం పెళ్లైనట్లు లావణ్య తెలిపారు. కొన్నాళ్ల క్రితం రాజ్ తరుణ్ తనకు అబార్షన్ చేయించారన్నారు. మెడికల్ డాక్యుమెంట్లను తాను పోలీసులకు అందించినట్లు చెప్పారు. లావణ్య అలియాస్ అన్విక పేరుతో తాము కలిసి ఉన్నట్లు చెప్పారు. అన్విక పేరుతో తాము విదేశాలకు వెళ్లామన్నారు. మాల్వీ వచ్చాక రాజ్ తరుణ్ తనను దూరం పెట్టారని ఆరోపించారు. మాల్వీ కోసం అతను ముంబై వెళ్లాడని, దీనిపై నిలదీయడంతో తనను దూరం పెట్టాడన్నారు.

# బీపీసీఎల్ ప్రతినిధులతో ముగిసిన సీఎం చంద్రబాబు సమావేశం



ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) ప్రతినిధి బృందం మధ్య సమావేశం ముగిసింది. నేడు రాష్ట్రానికి వచ్చిన బీపీసీఎల్ సీఎండీ కృష్ణకుమార్, ఆ సంస్థ ప్రతినిధులు తొలుత విజయవాడ దుర్గమ్మ దర్శనం చేసుకున్నారు. అనంతరం అమరావతి వచ్చి సీఎం చంద్రబాబుతో భేటీ అయ్యారు. ఏపీలో పెట్రో రిఫైనరీ (చమురు శుద్ధి కర్మాగారం) ఏర్పాటుపై చర్చించారు. దాదాపు రూ.60 వేల కోట్లతో ఏపీలో రిఫైనరీ ఏర్పాటు చేసేందుకు బీపీసీఎల్ ఆసక్తి వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. ఇటీవల సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటనలో కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్ దీప్ సింగ్ పురిని కలిశారు. ఈ సందర్భంగా మచిలీపట్నంలో రిఫైనరీ ఏర్పాటు చేసే ఆలోచనను ఆయన ముందుంచారు. ఈ నేపథ్యంలోనే, బీపీసీఎల్ ప్రతనిధులు ఏపీకి వచ్చి ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశం అయినట్టు తెలుస్తోంది.

# రేవంత్ రెడ్డి పాలనలో సామాజిక సమతూకం లేదు... బెదిరింపు ధోరణితో మాట్లాడుతున్నారు: బాల్క సుమన్

**35 కార్పోరేషన్‌లలో సామాజిక న్యాయం లేకుండా పోయిందని విమర్శ**

**కక్ష సాధింపు చర్యలు ఉండవని చెప్పారన్న బీఆర్ఎస్ నేత**

**నిరుద్యోగులు, విద్యార్థులను బెదిరింపులకు గురి చేసేలా వ్యవహరించారని ఆగ్రహం**

**కేబినెట్‌లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ మంత్రులకు అవమానం జరుగుతోందని వ్యాఖ్య**



రేవంత్ రెడ్డి పాలనలో ఎక్కడా సామాజిక సమతూకం కనిపించడం లేదని... పైగా బెదిరింపు ధోరణితో మాట్లాడుతున్నారని బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. ఇటీవల నియమించిన 35 కార్పోరేషన్‌లలో సామాజిక న్యాయం లేకుండా పోయిందని విమర్శించారు. బుధవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ... సుపరిపాలన అందిస్తామని... కక్ష సాధింపు చర్యలు ఉండవని సీఎం చెప్పారని... కానీ ఈరోజు నిరుద్యోగులు, విద్యార్థులను బెదిరింపులకు గురి చేసేలా వ్యవహరించారని మండిపడ్డారు. ఇదే రేవంత్ రెడ్డి అశోక్ నగర్‌లో రాహుల్ గాంధీని కోచింగ్ సెంటర్ల చుట్టూ తిప్పినప్పుడు ఇదే నిరుద్యోగుల పక్షాన డీఎస్సీ, గ్రూప్-1, టెట్ నిర్వహణ గురించి వీళ్ళు మాట్లాడలేదా? అని ప్రశ్నించారు. నిరుద్యోగుల సహకారంతో అధికారంలోకి వచ్చి ఇప్పుడు వారి నడ్డిమీద తన్నుతున్నారన్నారు. రేవంత్ రెడ్డి రాజ్యంలో అడుగడుగునా అవమానాలు, అవహేళనలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మంత్రుల పట్ల వివక్ష కనిపిస్తోందన్నారు. అన్ని వర్గాలకు న్యాయం... అందరికీ అవకాశాలు అంటూ రేవంత్ ముచ్చట్లు చెబుతున్నారని... కానీ రవ్వంత కూడా అలా కనిపించడం లేదన్నారు. కేబినెట్‌లోని ఎస్సీ, బీసీ మంత్రులకు అవమానాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. యాదాద్రిలో ఉద్దేశపూర్వకంగా ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు చిన్నపీట వేసి కూర్చోబెట్టారన్నారు. కానీ రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పెద్దపీటలపై కూర్చున్నారని తెలిపారు. నిన్న బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం సందర్భంగా సేమ్ సీన్ రీపిట్ అయిందన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌కు బల్కంపేట ఎల్లమ్మ తల్లి సాక్షిగా అవమానం జరిగిందన్నారు. ఆయనను అధికారులు రిసీవ్ చేసుకోలేదన్నారు.

# ఏపీ సీఎం చంద్రబాబుతో వియత్నాం ఆటోమొబైల్ సంస్థ ప్రతినిధుల భేటీ

**రాష్ట్రానికి విచ్చసిన విన్ ఫాస్ట్ బృందం**

**ఏపీలో పరిశ్రమ స్థాపించాలని ఆహ్వానించిన చంద్రబాబు**

**తమ భాగస్వామ్యం విజయవంతమవుతుందన్న ఆశాభావం**



ఏపీ అభివృద్ధి దిశగా కీలక అడుగులు పడుతున్నాయి. వియత్నాంకు చెందిన ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ విన్ ఫాస్ట్ ప్రతినిధి బృందం నేడు రాష్ట్రానికి విచ్చేసింది. విన్ ఫాస్ట్ సీఈవో ఫామ్ సాన్ చౌ, ఆ సంస్థ ప్రతినిధులు సీఎం చంద్రబాబును కలిశారు. దీనిపై చంద్రబాబు ట్వీట్ చేశారు. విన్ ఫాస్ట్... వియత్నాంకు చెందిన ప్రముఖ ఎలక్ట్రిక్ వాహనాలు, బ్యాటరీల తయారీ సంస్థ అని వెల్లడించారు. ఆ సంస్థ సీఈవో ఫామ్ సాన్ చౌతో సమావేశమయ్యానని వెల్లడించారు. ఏపీలో విద్యుత్ ఆధారిత వాహనాలు, బ్యాటరీల తయారీ పరిశ్రమ స్థాపించాలని విన్ ఫాస్ట్ సంస్థను ఆహ్వానించానని చంద్రబాబు తెలిపారు. విన్ ఫాస్ట్ కంపెనీకి అనువైన భూములను పరిశీలించాల్సిందిగా పరిశ్రమల శాఖను ఆదేశించానని వివరించారు. విన్ ఫాస్ట్ సంస్థతో విజయవంతమైన భాగస్వామ్యం కోసం ఎదురుచూస్తున్నామని పేర్కొన్నారు.

# స్టాక్ మార్కెట్ జోరుకు బ్రేక్... నష్టాలతో ముగిసిన సూచీలు

**వరుస లాభాలకు అడ్డుకట్ట**

**అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు**

**లాభాల స్వీకరణకు మొగ్గుచూపిన ఇన్వెస్టర్లు**



గత కొన్ని రోజులుగా వరుసగా లాభాలతో సరికొత్త జీవితకాల గరిష్ఠాలను అందుకున్న స్టాక్ మార్కెట్ సూచీలు నేడు నష్టాలతో ముగిశాయి. నేడు సెన్సెక్స్, నిఫ్టీలు భారీ లాభాలతో మొదలయ్యాయి. అయితే, కాసేపటికే ట్రెండ్ మారింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు రావడం, ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో స్టాక్ మార్కెట్ సూచీలు పతనమయ్యాయి. చివరికి 426.87 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్ 79,924.77 వద్ద ముగిసింది. 108.75 పాయింట్లు నష్టపోయిన నిఫ్టీ 24,324.45 వద్ద స్థిరపడింది. ఏషియన్ పెయింట్స్, ఎస్బీఐ లైఫ్, దివీస్ ల్యాబ్స్, బ్రిటానియా, గ్రాసిమ్ షేర్లు లాభాలు అందుకోగా... మహీంద్రా అండ్ మహీంద్రా, హిండాల్కో, టాటా స్టీల్, టీసీఎస్, హెచ్ సీఎల్ టెక్ నష్టాలు చవిచూశాయి.

# భారత్-చైనా సరిహద్దుల్లో 108 కిలోల బంగారం స్వాధీనం

**తూర్పు లడఖ్ లో చాంగ్ తాంగ్ సబ్ సెక్టార్ లో ఘటన**

**పక్కా సమాచారంతో స్మగ్లర్ల ఆటకట్టించిన ఐటీబీపీ బలగాలు**

**ఐటీబీపీ చరిత్రలో ఇంత పెద్ద మొత్తంలో తొలిసారిగా బంగారం స్వాధీనం**





భారత్-చైనా సరిహద్దుల్లో గస్తీ కాస్తున్న ఐటీబీపీ (ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్) బలగాలు భారీ ఎత్తున బంగారం స్వాధీనం చేసుకున్నాయి. ఔషధ మొక్కల డీలర్ల ముసుగులో 108 కిలోల బంగారం అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తులను భారత భద్రతా బలగాలు అదుపులోకి తీసుకున్నాయి. ఐటీబీపీ చరిత్రలో ఇంత పెద్ద మొత్తంలో బంగారం స్వాధీనం చేసుకోవడం ఇదే ప్రథమం. తూర్పు లడఖ్ లోని చాంగ్ తాంగ్ సబ్ సెక్టార్ లో ఈ ఘటన చోటుచేసుకుంది. డిప్యూటీ కమాండెంట్ దీపక్ భట్ నాయకత్వంలోని పెట్రోలింగ్ స్క్వాడ్ పక్కా సమాచారంతో స్మగ్లర్లను పట్టుకుంది. వారి నుంచి బిస్కెట్ల రూపంలో ఉన్న బంగారంతో పాటు రెండు ఫోన్లు, ఒక బైనాక్యులర్, రెండు కత్తులు, కొన్ని రకాల చైనీస్ ఆహార పదార్థాలు, కేక్ లు, పాలు స్వాధీనం చేసుకున్నారు. ఐటీబీపీ బలగాలను చూసి స్మగ్లర్లు పారిపోయే ప్రయత్నం చేయగా, వెంటాడి పట్టుకున్నారు.

# భారతీయుడు 2 సినిమా టిక్కెట్ ధరల పెంపునకు తెలంగాణ ప్రభుత్వం అనుమతి

**సింగిల్ థియేటర్లలో రూ.50, మల్టీప్లెక్స్‌లలో రూ.75 పెంపునకు అనుమతి**

**12 నుంచి 19వ తేదీ వరకు టిక్కెట్ ధర పెంచుకోవడానికి అనుమతి**

**వారం రోజుల పాటు థియేటర్‌లలో ఐదో షో ప్రదర్శనకు అనుమతి**




భారతీయుడు 2 చిత్రం టిక్కెట్ ధరల పెంపునకు తెలంగాణ ప్రభుత్వం అనుమతినిచ్చింది. సింగిల్ స్క్రీన్ థియేటర్లలో రూ.50, మల్టీప్లెక్స్ థియేటర్లలో రూ.75 పెంపునకు అనుమతించింది. ఈ సినిమా టిక్కెట్ ధరలను 12వ తేదీ నుంచి 19వ తేదీ వరకు పెంచుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం ఓకే చెప్పింది. అలాగే ఈ వారం రోజుల పాటు థియేటర్‌లలో ఐదో షో ప్రదర్శనకు అనుమతి ఇచ్చింది. కమల్ హాసన్ - శంకర్ కాంబినేషన్‌లో 1996లో వచ్చిన భారతీయుడు సినిమాకు సీక్వెల్‌గా భారతీయుడు-2ను రూపొందించారు. ఈ సినిమా ఎల్లుండి విడుదల కానుంది.

# జింబాబ్వేకి 183 పరుగుల టార్గెట్ సెట్ చేసిన టీమిండియా

## టీమిండియా, జింబాబ్వే జట్ల మధ్య మూడో టీ20

## టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న టీమిండియా

## నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లకు 182 పరుగుల నమోదు

## అర్ధసెంచరీతో అలరించిన కెప్టెన్ శుభ్ మాన్ గిల్

## రాణించిన రుతురాజ్ గైక్వాడ్, జైస్వాల్



జింబాబ్వేతో మూడో టీ20 మ్యాచ్ లో టీమిండియా భారీ స్కోరు సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లకు 182 పరుగులు చేసింది. టాపార్డర్ లో ఒక్క అభిషేక్ శర్మ తప్ప మిగతా అందరూ దూకుడుగా ఆడారు. అభిషేక్ శర్మ కేవలం 10 పరుగులకే అవుటయ్యాడు. కెప్టెన్ శుభ్ మాన్ గిల్ 66 పరుగులతో టాప్ స్కోరర్ గా నిలిచాడు.

మొదట బ్యాటింగ్ చేసిన టీమిండియాకు శుభారంభం లభించింది. ఓపెనర్లు యశస్వి జైస్వాల్, శుభ్ మాన్ గిల్ తొలి వికెట్ కు 8, 1 ఓవర్లలోనే 67 పరుగులు జోడించారు. జైస్వాల్ 27 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సులతో 36 పరుగులు చేయగా... గిల్ 49 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సులతో 66 పరుగులు సాధించాడు. రుతురాజ్ గైక్వాడ్ 28 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సులతో 49 పరుగులు నమోదు చేశాడు. ఆఖర్లో సంజూ శాంసన్ 12, రింకూ సింగ్ 1 పరుగుతో నాటౌట్ గా నిలిచారు. జింబాబ్వే బౌలర్లలో బ్లెస్సింగ్ ముజరబాని 2, కెప్టెన్ సికిందర్ రజా 2 వికెట్లు తీశారు.

# జింబాబ్వేతో మూడో టీ20... టాస్ గెలిచిన టీమిండియా

## జింబాబ్వేలో పర్యటిస్తున్న టీమిండియా

## ఐదు మ్యాచ్ ల టీ20 సిరీస్ లో నేడు మూడో మ్యాచ్

## టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న టీమిండియా




టీమిండియా, జింబాబ్వే జట్ల మధ్య నేడు మూడో 20 మ్యాచ్ జరగనుంది. టాస్ గెలిచిన టీమిండియా బ్యాటింగ్ ఎంచుకుంది. ఐదు మ్యాచ్ ల టీ20 సిరీస్ కోసం టీమిండియా యువ జట్టు ప్రస్తుతం జింబాబ్వేలో పర్యటిస్తోంది. సిరీస్ లోని తొలి మ్యాచ్ లో ఆతిథ్య జింబాబ్వే విజయం సాధించగా, రెండో మ్యాచ్ ను టీమిండియా కైవసం చేసుకుంది. వరల్డ్ కప్ ఆడిన జట్టులోని సభ్యులైన సంజు శాంసన్, యశస్వి జైస్వాల్, శివమ్ దూబె నేడు జింబాబ్వేతో మూడో టీ20 సందర్భంగా తుది జట్టులోకి వచ్చారు. అటు, జింబాబ్వే జట్టులో రెండు మార్పులు జరిగాయి. ఇన్నోసెంట్ కయా స్థానంలో తదివనాషే మరుమని... ల్యూక్ జోంగ్వే స్థానంలో రిచర్డ్ ఎంగరావా జట్టులోకి వచ్చారు.

# రూ.2.5 కోట్లు చాలు .. మిగతా రూ.2.5 కోట్లు వెనక్కి తీసుకోండి



- ఇతర కోచింగ్ సిబ్బందితో సమానంగా రూ.2.5 కోట్లు చాలన్న మాజీ కోచ్
- ద్రావిడ్ విజ్ఞప్తిని గౌరవిస్తామన్న బీసీసీఐ వర్గాలు
- 2018లో అండర్-19 వరల్డ్ కప్ గెలిచినప్పుడు కూడా రూ.30 లక్షలు వెనక్కి ఇచ్చేసిన క్రికెట్ దిగ్గజం

టీమిండియా మాజీ ప్రధాని కోచ్, టీ20 వరల్డ్ కప్ 2024ను భారత్ గెలవడంలో కీలక పాత్ర పోషించిన మాజీ దిగ్గజం రాహుల్ ద్రావిడ్ ఎంత హుందాగా నడుచుకుంటారో తెలియజేసే పరిణామం ఒకటి వెలుగుచూసింది. ఇటీవల టీ20 వరల్డ్ కప్‌ను గెలిచిన భారత జట్టుకు బీసీసీఐ ఏకంగా రూ.125 కోట్ల భారీ రికార్డు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ భారీ మొత్తం నుంచి ఆటగాళ్లతో సమానంగా ప్రధాన కోచ్ ద్రావిడ్‌కు కూడా బీసీసీఐ రూ.5 కోట్లు అందించింది. అయితే ప్రత్యేకంగా తనకు రూ.5 కోట్లు వద్దని, ఇతర కోచింగ్ సిబ్బంది మాదిరిగానే రూ.2.5 కోట్లు ఇస్తే చాలు అని, మిగతా రూ.2.5 కోట్లు వెనక్కి తీసుకోవాలంటూ బీసీసీఐకి రాహుల్ ద్రావిడ్ విజ్ఞప్తి చేశాడు. మిగిలిన సహాయక సిబ్బంది బౌలింగ్ కోచ్ పరాస్ మాంబ్రే, ఫీల్డింగ్ కోచ్ దిలీప్, బ్యాటింగ్ కోచ్ విక్రమ్ రాథోడ్ మాదిరిగానే తనకు కూడా రూ. 2.5 కోట్లు ఇవ్వాలని, బోనస్ అవసరం లేదని కోరినట్టు బీసీసీఐ వర్గాలు తెలిపాయి. కాగా ద్రావిడ్ సెంటిమెంట్‌ను గౌరవిస్తామంటూ బీసీసీఐ పేర్కొన్నట్టు ఓ జాతీయ మీడియా సంస్థలో కథనం వెలువడింది. కాగా టీ20 వరల్డ్ కప్ గెలుపులో కీలక పాత్ర పోషించిన కోచింగ్ సిబ్బంది, ఇతర సహాయక సిబ్బందికి కూడా బీసీసీఐ భారీ నజరానా ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రధాన కోచ్ రాహుల్ ద్రవిడ్‌కు రూ.5 కోట్లు, ఇతర కోచ్‌లకు రూ. 2.5 కోట్లు చొప్పున కేటాయించింది. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ కోచ్‌లతో పోల్చితే ద్రావిడ్ రూ.2.5 కోట్లు ఎక్కువ పొందినట్టు అయింది.

### అండర్-19 వరల్డ్ కప్ గెలిచినప్పుడు కూడా ఇంతే..

2018లో అండర్-19 ప్రపంచ కప్‌ను భారత్ గెలుచుకున్నప్పుడు జట్టు ప్రధాన కోచ్‌గా ఉన్న రాహుల్ ద్రావిడ్ ఆ సమయంలో కూడా ఇదే విధంగా వ్యవహరించాడు. రివార్డుగా రూ.50 లక్షలు పొందాల్సి ఉండగా ఇతర సహాయక సిబ్బంది మాదిరిగా తనకు కూడా రూ.20 లక్షలు చాలు అని చెప్పాడు. రూ.30 లక్షలు తిరస్కరించాడు. రివార్డు అందరికీ సమానంగా ఉండాలని ఆ సందర్భంగా పేర్కొన్నాడు. దీంతో కోచింగ్, ఇతర సహాయక సిబ్బంది అందరికీ రూ.25 లక్షలు చొప్పున బీసీసీఐ రికార్డు అందించింది.

# స్విమ్ షూట్ లో హంస అందాల జాతర!





హంసానందిని నాలుగేళ్లగా అవకాశాల కోసం ఎంత సీరియస్ ప్రయత్నాల్లో ఉందో తెలిసిందే. మునుపటి అందాన్ని సొంతం చేసుకుని హంసలో అందం ఏమాత్రం తరిగిపోలేదనడానికి ఎన్నో షూటో షూట్లతో ప్రూవ్ చేసింది. మునుపటి కంటే రెట్టించిన ఉత్సాహంతో ఇన్ స్టాలో యాక్టివ్ గా కొనసాగుతుంది. తన లో హాట్ అప్పిరియన్స్ ని ఎప్పటికప్పుడు హైలైట్ చేస్తూనే ఉంది. కానీ అమ్మడికి మాత్రం అవకాశాలు రానట్లే కనిపిస్తుంది.( కనుచూప మేర ఎక్కడా ఫలానా ప్రాజెక్ట్ కోసం పరిశీలనలో ఉన్నట్లు గాసిప్ కూడా తెరపైకి రావడం లేదు. అంటే హంసానందినికి అవకాశాలకి ఎంత దూరంగా ఉందో ఊహించొచ్చు. చివరిగా అమ్మడు %--%పంతం%--% సినిమాలో నటించింది. ఆ తర్వాత వెండి తెరపై మెరిసింది లేదు. అనారోగ్యం నుంచి కోలుకున్న తర్వాత ఇన్ స్టాలో యాక్టివ్ అయినా..తెలిసిన దర్శక-నిర్మాతల ద్వారా ప్రయత్నాలు చేసినా ఇంతవరకూ ఒక్క ఛాన్స్ కూడా రాలేదు. వెబ్ సిరీస్ లు..టీవీషోలు లాంటివి ఏవైనా చేస్తుందా? అంటే అక్కడా అవకాశాలు రానట్టే కనిపిస్తుంది. టీవీ షోలకు ఛాన్సెస్ ఉన్నా అమ్మడు నటిగా...ఐటం భామగానే కనిపించాలనే ఆసక్తి తో టీవీ రంగం వైపు ప్రయత్నించి ఉండకపోవచ్చని తెలుస్తుంది. మరి ఈ ఫేజ్ ని దాటి హంస అవకాశాలు అందుకుం టుందా? ఆమె కోసమంటూ ఛాన్సులు ఇవ్వడానికి ఎవరైనా ముందుకొస్తారా? అన్నది చూడాలి. ఇలా ప్రయత్నాలు చేస్తున్నా అవకాశాలు రాకపోయినా ఇన్ స్టాలో మాత్రం నిత్యం వెలుగుతూనే ఉంది. తనదైన హాట్ అప్పిరియన్స్ తో కుర్రాళ్లను అలరిస్తూనే ఉంది. తాజాగా అమ్మడు స్విమ్మింగ్ పూ లో స్విమ్ షూట్ ఫోటోని షేర్ చేసింది. తడిసిన అందాలతో అమ్మడు కిల్లర్ లుక్ కి ఫిదా చేస్తుంది. హంస అందానికి ఎవరైనా ఫిదా అవ్వాల్సిందే అన్నిపిస్తుంది. ఈ ఫోటోని ఉద్దేశించి అమ్మడు ఓ కొంటె కామెంట్ కూడా విసరింది. నేను ఇలా ఉన్నాను అంటే నా కళ్లు మీమ్మల్నే వెతుకుతుంటాయి అంటూ క్యాప్షన్ ఇచ్చింది. ప్రస్తుతం ఈ ఫోటో నెట్టింట వైరల్ గా మారింది. అభిమానుల కామెంట్లలోనూ అంతే ఉత్సాహం కనిపిస్తుంది.

**అవ్నీత్ కౌర్: బ్లాక్ బ్రాలెట్‌లో ఇంటర్నెట్‌ను బ్రేకింగ్ చేస్తోంది**



**బ్లాక్ మోనోకినిలో షామా సికిందర్ సిజిల్స్**

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com